క్లుప్తంగా

ఫర్నిచర్ బహూకరణ



మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని వీరారం జెడ్పీఎస్ఎస్ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన భూ దాత డాక్టర్ కట్కూరి నరేందర్‌రెడ్డి మంగళవారం రూ.లక్ష విరాళంతో పాటు ఫర్నిచర్‌ను బహూకరించారు. ప్రభుత్వ పాఠశాలకు భారీ సాయాన్ని అందజేస్తున్న దాత నరేందర్‌రెడ్డి గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ లక్ష్మీనిర్మల, ఉపాధ్యాయులు ఆర్ మధు, రెడ్డి, జానకి, మాచర్ల రవి, వెంకట్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

డోర్నకల్ : బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. బతుకమ్మ పార్కు, పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ నరేష్‌రెడ్డి, కౌన్సిలర్ బోరగళ్ల శరత్, కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

8న జాబ్‌మేళా

డోర్నకల్ : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహబూబాబాద్‌లోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో సుమారు 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఫార్మసీ చదివినవారు సద్వినియోగం చేసుకోవాలని సీఐ కోరారు.

ఘనంగా బొడ్డెమ్మ నిమజ్జనం



గూడూరు : మండల కేంద్రంలోని సనాతన శివాలయంతో పాటు శ్రీలక్ష్మీనారాయణస్వామి, ఎస్సీ కాలనీ, చంద్రుగూడెం, యాదవనగర్‌లతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం తొమ్మిదో రోజు మంగళవారం బొడ్డెమ్మ నిమజ్జన వేడుకలను మహిళలు జరుపుకున్నారు.

నిత్యావసరాల పంపిణీ

మరిపెడ రూరల్ : మండలంలోని సీతారాంతండా వరద బాధిత కుటుంబాలకు సెయింట్ అగస్టీన్స్ స్కూల్ యాజమాన్యం చేయూతనందించింది.మంగళవారం 50 బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యోతిస్, ట్విన్సీ, అగ్నస్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా 'రేషన్' దందా



నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

- పోలీసుల అదుపులో బియ్యం లారీ?

నర్సింహులపేట : రేషన్ బియ్యం దందాలో నర్సింహులపేట మండలానికి రాష్ట్ర స్థాయిలో పేరుంది. అయితే బియ్యం సరఫరా అడ్డుకునేందుకు అన్ని వైపులా నుంచి కట్టడి చేయడంతో కొంతకాలంగా సద్దుమణిగింది.కాగా ఇటీవల కాలంలో మళ్లీ రేషన్ దందా మొదలైనట్లు జిల్లాలో చర్చ జరుగుతోంది. పట్టుకుంటే కేసులు..లేకపోతే కాసుల వర్షం కురిపించే బియ్యం దందా చేస్తే రూ.లక్షల్లో సంపాదించవచ్చనే ఆలోచనతో కొత్త వ్యాపారులు రంగంలోకి దిగినట్లు తెలిసింది.

డీలర్లే సూత్రధారులు..!

అక్రమ రేషన్ బియ్యం దందాకు మండలంలోని పలువురు డీలర్లే సూత్రధారులుగా వ్యవహరించి సెటిల్ మెంట్లు చేస్తున్నట్లు ప్రచారం. పక్కజిల్లాకు చెందిన ఓ వ్యాపారికి బియ్యం సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఇందు కోసం ఓ సీనియర్ డీలర్ తన అనుచరులతో పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులతో సంప్రదింపులు చేశారని చర్చ.. తమ వ్యాపారానికి అడ్డు రాకుండా ఉండాలని కోరినట్లు సమాచారం.

పట్టుబడిన బియ్యం లారీ?

అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ మంగళవారం పట్టుపడడం గమనార్హం. మండలంలోని ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై, టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు సమాచారం మేరకు లారీని పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు తెలిసింది.

> **లారీని స్వాధీనం చేసుకున్నాం..**
> పీఎస్‌లో బియ్యం లారీ పట్టుబడడంపై ఎస్సై మాలోత్ సురేశ్‌ను వివరణ కోరగా..మంగళవారం ఉదయం ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారి నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల సరిహద్దు ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేస్తుండగా లారీని పట్టుకోని స్థానిక పీఎస్‌కు తరలించడం జరిగిందన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు.
> – మాలోత్ సురేశ్, ఎస్సై, నర్సింహులపేట

ఇనుగుర్తిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



ఇనుగుర్తిలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

కేసముద్రం : కొత్తగా ఏర్పాటైన ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇనుగుర్తిని మండలంగా ఏర్పాటు చేశామన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం మండలాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు ఇతర ఆఫీసులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందుగా ఇదే గ్రామానికి చెందిన గుజ్జునూరి రామతార అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బేతమళ్ల చంద్రయ్య, వెంకన్న, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

డీజేలను అడ్డుకుంటారా?

- అర్ధరాత్రి మహిళల ఆందోళన



గూడూరు : బొడ్డెమ్మ నిమజ్జన వేడుకల్లో డీజేలతో మహిళలు కోలాటమాడుతూ వెళ్తుండగా మంగళవారం రాత్రి పోలీసులు డీజేలు పెట్టరాదంటూ అడ్డుకున్నారు. దీంతో మహిళలు గూడూరు మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. బొడ్డెమ్మ వేడుకల సందర్భంగా డీజేల సౌండ్స్ తో వెళ్తున్నారంటూ పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో హిందువుల వేడుకలకు అడ్డుకుంటారా అని రోడ్డుపై బైఠాయించారు. కాగా భయంతో పారిపోయిన డీజే ఆపరేటర్లను తిరిగి తీసుకురావాలంటూ మహిళలు ఆందోళన చేపట్టారు.

ఉపాధ్యాయుల ఆసరా..



అశోక్

దోర్నకల్ : పంపుబావితండాకు చెందిన రమావత్ అశోక్ (6) స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. అశోక్ ఇటీవల డెంగీతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సమయంలో వైద్యపరీక్షలు చేయగా బీపీ, షుగర్‌తో పాటు లివర్ ఫంక్షన్, కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అక్కడే చికిత్స ప్రారంభించారు. అయితే అశోక్‌కు రోజూ రూ.2,500 విలువైన ఇంజక్షన్‌ను 25 రోజుల పాటు వేయాల్సి రావడంతో విషయం తెలిసిన బాలికల పాఠశాలతో పాటు డోర్నకల్ జెడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయులు కొంత ఆర్థికసాయం చేశారు. హెచ్ఎం బండి నర్సింహారావు అశోక్ పరిస్థితిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ దృష్టికి తేవడంతో వారు ఎంజీఎం వైద్యులతో మాట్లాడి ఇంజక్షన్లను ఉచితం వేయించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నర్సింహారావు మాట్లాడు తూ ఎమ్మెల్సీ, కలెక్టర్ పాటు ఉపాధ్యాయుల సహకారంతో అశోక్ పూర్తిగా కోలుకునేంతవరకు వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న హెచ్ఎం నర్సింహారావు

రిజర్వేషన్లు అమలు చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పిడమర్తి రవి, తదితరులు

నెహ్రూసెంటర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మేలుకొలుపు యాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల మంది దళిత కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ రిజర్వేషన్ అమలు చేసి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. మాదిగ విద్యార్థి జేఏసీ యూనివర్సిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ములకల నరేష్, ఏబీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగుర్తి సుధాకర్, అడ్వకేట్ దర్శనం రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగేందర్, శ్రీధర్, పాలెపాక వెంకన్న, నాగరాజు, సురేష్, స్వామినాయక్ పాల్గొన్నారు.

భూమికోసం ఇరువర్గాల ఘర్షణ



ర్యాలీగా వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దంతాలపల్లి : మండలంలోని నిదానపురంలో భూమి విషయంలో గ్రామస్తులకు, ఎమ్మార్పీఎస్ నాయకుల మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది.స్థానికులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం దళితుల భూమి ఆక్రమించి కట్టడాలు నిర్మించేందుకు చూస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు.కాగా పృథ్విరెడ్డి అనే దాత గ్రామంకోసం భూమిని ఇచ్చాడని గ్రామస్తులు తెలుపుతున్నారు. అయితే మధ్యాహ్నం సుమారు 60 మంది ఎమ్మార్పీస్ నాయకులు కొంతమంది గ్రామస్తులతో కలిసి బతుకమ్మ ఏర్పాట్లను తొలగించడంతో, గ్రామస్తులు అడ్డుకున్నారు.ఆ భూమి దళితులదని పనులు ఎలా చేస్తారని ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడికి చేరుకున్న ఎస్సై తన సిబ్బందితో ఇరువర్గాలను చెదరగొట్టి స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాలలో 11 మందిని తహసీల్దారు కార్యాలయంలో బైండోవర్ చేశారు.ఈ ఘర్షణలో ఎమ్మార్పీఎస్ నాయకులు గుగ్గిల పీరయ్య, దుపెల్లి అనిల్,శాగంటి రమేష్, పోలేపాక ఎల్లయ్య, ప్రవీణ్, ఇరుగు రవి, ఎండీ రజియా, మిడుతపల్లి వెంకన్న, గ్రామస్తులు నరేష్, హరి, యోగి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



కురవి: మాట్లాడుతున్న రాజు

కురవి : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తాచాటాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభ నిర్వహించగా, పార్టీ పతాకాన్ని నాగయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీపీఎం అభ్యర్థులను గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంధసిరి శ్రీనివాస్, లావుడ్య అచ్చాలి, మలేడి కోటయ్య, నల్లపు సుధాకర్, కట్ల కృష్ణయ్య, మాలోత్ కిషన్‌నాయక్, జ్యోతిబసు పాల్గొనగా కురవి శాఖ కార్యదర్శిగా కట్ల కృష్ణయ్య, లింగ్యా తండా కార్యదర్శిగా లావుడ్య హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కేసముద్రం: మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం

తొర్రూరు రూరల్ / కేసముద్రం : కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో, కేసముద్రం మండలంలోని కల్వలలో మంగళవారం సీపీఎం గ్రామ మహాసభ నిర్వహించారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతుంటే, ప్రధాని మోదీ మాత్రం మతోన్మాద జపం చేస్తున్నాడని విమర్శించారు. కాగా సీపీఎం కల్వల గ్రామశాఖ నూతన కార్యదర్శిగా తాడబోయిన లింగమ్మ ఎన్నికయ్యారు. నాయకులు రాజన్న, నక్క సైదులు, వెంకటేశ్వర్లు,జయరాజ్, శ్రీశైలం, కిషన్ పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల కోసం వివరాలు సేకరించాలి

మహబూబాబాద్ : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం వివరాలు సేకరించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సీఎస్ శాంతికుమారితో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులు, ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ఈనెల 3నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రతి నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలో ఇంటింటా సర్వే చేసి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలన్నారు. వీసీలో కలెక్టర్ , అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో..



నెల్లికుదురు: మోడల్ స్కూల్‌లో..



తొర్రూరు: సిద్ధార్థ పాఠశాలలో..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను మంగళవారం బాలికలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థినులు వివిధ రకాల పూలను తీసుకొచ్చి బతుకమ్మలను పేర్చి ఆడి, పాడారు. రంగురంగు కాగితాలతో తయారు చేసి బతుమ్మలను తయారు చేసి ఆటలాడారు. డోర్నకల్‌లో విద్యార్థులు కేరింతలు కొడుతూ రావణాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: తక్షశిల హైస్కూల్‌లో బతుకమ్మ సంబురాలు



మరిపెడలో..



డోర్నకల్‌లో..



బయ్యారం: అక్షర విద్యానికేతన్‌లో..



గార్ల నిర్మలా హైస్కూల్లో..



కురవి: బలపాలలో బతుకమ్మలతో విద్యార్థినులు



కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని స్కూల్‌లో..



నెల్లికుదురు: శ్రీరామగిరి ప్రభుత్వ పాఠశాలలో..



మహబూబాబాద్ రూరల్: మాధవపురంలో..



మహబూబాబాద్ అర్బన్: ఏకశిల హైస్కూల్‌లో..



పెద్దవంగర: బొమ్మకల్లు జెడ్పీ హైస్కూల్‌లో..

'ఐబీ' మద్యం అడిగినందుకు దాడి

దంతాలపల్లి : మండలకేంద్రంలోని మంజునాథ వైన్స్‌లో 'ఐబీ మద్యం' అడిగినందుకు మద్యం ప్రియులపై వైన్‌షాపు సిబ్బంది మంగళవారం దాడికి పాల్పడ్డారు. తొర్రూరు మండలం మాటేడు గ్రామానికి చెందిన సెంట్రింగ్ సంఘం సభ్యులు బండారి సంతోష్, కోంద్రు లింగమూర్తిని మద్యం తీసుకురమ్మని దంతాలపల్లికి పంపారు. వారు మంజునాథ వైన్స్‌కు చేరుకోని అక్కడి సిబ్బందితో తమకు ఐబీ బ్రాండ్ మద్యం కావాలని అడిగారు. దీంతో సదరు సిబ్బంది తమ దగ్గర ఐబీ లేదని, ఐకాన్ మద్యం ఉందని చెప్పారు. ఈక్రమంలో ఐబీ మద్యం బెల్టు షాపులకు తరలించడాన్ని గమనించి వారు బెల్టు షాపులకు తరలిస్తున్నారు కదా..తమకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. దీంతో సిబ్బందికి వారికి మధ్య మాటకు మాట పెరిగి, ఇష్టం వచ్చినట్లుగా ఇరువురిపై దాడి చేశారు. గమనించిన స్థానికులు సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం సంతోష్, లింగమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి వారిపైకేసు నమోదు చేస్తానని ఎస్సై రాజు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

గోదావరి జలాల విడుదల

కురవి : ఎస్సారెస్పీ కాల్వ డీబీఎం-48 వెన్నవరం ఉపకాల్వ ద్వారా గోదావరి జలాలు విడుదల అయ్యాయి. సోమవారం గోదావరి జలాలను అధికారులు విడుదల చేయడంతో కురవి, సీరోలు మండలాల మీదుగా డోర్నకల్ మండలంలోని వెన్నవరం వరకు ప్రవహిస్తున్నాయి.

ఓపెన్ టెన్త్ అడ్మిషన్లకు ఆహ్వానం

కురవి : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు రేపటి వరకు గడువు ఉందని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎ.కార్తీక్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 98852 14380 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మరిపెడ : ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 24న జరిగే పీడీఎస్‌యూ 50వసంతాల సభను విజయవంతం చేయాలని తొర్రూర్ డివిజన్ కార్యదర్శి గొడిశాల మనోజ్ కోరారు. ఈ మేరకు మరిపెడలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆహ్వాన పత్రాలు..

కేసముద్రం : మండల కేంద్రంలోని ఆర్యవైశ్యభవన్‌లో శ్రీమాత వెల్ఫేర్ సహకారంతో వాసవీ మిత్ర మండలి ఆధ్వర్యంలో 15వ వార్షిక శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రాలను మంగళవారం ఆవిష్కరించారు.

విలీన సభను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) టీయూసీఐలో విలీనం సందర్భంగా సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిళ్ళకంటి సూర్యం అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సభల వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

చిన్నగూడూరు : మండలంలోని మంగోరిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి బానోత్ అనూషకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. కురవి అంబులెన్స్ సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ వెంకన్న సిబ్బంది అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది.

జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలి

మహబూబాబాద్ : జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు సాహితీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో మంగళవారం జేవీవీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండల కమిటీ ఎన్నిక

గార్ల : టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పాపావత్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ బాలాజీనాయక్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్‌గా కొండ హనుమంతు, ఉపాధ్యక్షుడిగా పి.వెంకట్‌రెడ్డి, కవిత, కార్యదర్శులుగా సంతు, రామనాథం, రమేష్, మహిళా కార్యదర్శులుగా రోజారాణి, తిరుపతి, పార్వతితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఫొటోగ్రాఫర్స్ మండల కమిటీ..

ఫొటోగ్రాఫర్స్ గార్ల మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బల్లెం దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్, కోశాధికారిగా రావూరి ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా రాజేందర్‌గౌడ్

నెహ్రూసెంటర్ : బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శిగా ముంజాల రాజేందర్‌గౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

బయ్యారం : అటవీ జంతువుల వేట కోసం ఉచ్చులు బిగించిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్‌ఓ నాగమణి తెలిపారు. చింతోనిగుంపు గ్రామానికి చెందిన సీహెచ్ లక్ష్మినారాయణ, పి.ప్రసాద్, ఎం.రవిలు ఐదు రోజుల క్రితం అటవీప్రాంతంలో జంతువుల కోసం ఉచ్చులు బిగించగా అడవిపంది పడింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లగా ద్విచక్ర వాహనాలను వదిలేసి పారిపోయారు.

పరామర్శ

కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నేత గుజ్జునూరి బాబురావు భార్య రామతార సోమవారం మృతి చెందింది. కాగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నరేశ్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్ ఆరా..

మరిపెడ రూరల్ : మరిపెడలోని పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి సోమవారం గుండెపోటుకు గురికాగా, హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి నరేష్ రెడ్డి ఆరోగ్యంపై ఆయన కుమారుడు అభినవ్ రెడ్డి ద్వారా తెలుసుకున్నారు.

మహిళలకు అవగాహన

గూడూరు : మండల కేంద్రంలోని ఉదయశ్రీ మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల ప్రతినిధులకు పశు వైద్యాధికారి రాము పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, మదర్ యూనిట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

బహుమతుల ప్రదానం

గార్ల : మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్, ఎంఈఓ వీరభద్రం బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి

నెల్లికుదురు : రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థి సింహాద్రి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉపేందర్‌రావు, పీఈటీ కొమురయ్య తెలిపారు. ఈ నెల 2 నుంచి 5వరకు నారాయణఖేడ్‌లో జరిగే పోటీలో పాల్గొంటాడు.

విద్యార్థుల చదువుకు సహకరించాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థుల చదువుకు తల్లిదండ్రులు సహకరించాలని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్ఎం కిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

రేపటినుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

మహబూబాబాద్ రూరల్ : దసరా వేడుకల్లో భాగంగా రేపటినుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు జరగనున్న ఉత్సవాల్లో దుర్గాదేవి అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు, వేడుకలు జరిపేందుకు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : ఈ నెల 25, 26, 27 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేర్కోని రాజు పిలుపునిచ్చారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తొర్రూరు : రైతులకు రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయించినా, కాలం చెల్లిన మందులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ శ్రీదేవి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు.

సమయపాలన పాటించాలి

నెల్లికుదురు : ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని మండల ప్రత్యేకాధికారి జినుగు మరియన్న అన్నారు. బ్రాహ్మణకొత్తపల్లి, కేజీబీవీలను మంగళవారం ఆయన సందర్శించారు.

సేంద్రియ వ్యవసాయం మేలు

నెల్లికుదురు : సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలు జరుగుతుందని మండల కోఆర్డినేటర్ కృష్ణ రైతులను సూచించారు. మంగళవారం సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

డ్రగ్స్ నిర్మూలనకు యువత ముందుండాలి

కేసముద్రం: డ్రగ్స్ నిర్మూలనకు యువత ముందుండాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలోజాతీయ మానవహక్కుల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారంఆయన బహుమతులు అందజేశారు.